
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 1 జనవరి 2024
5
తిరుపతి



నేడు రాకెట్ ప్రయోగం...

- పిఎస్ఎల్వి - సి58 ద్వారా ఎక్స్‌పో శాట్ ప్రయోగం
- కౌంట్ డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరోకీలక రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం పిఎస్ఎల్వి – సి58 రాకెట్‌ను ప్రయోగించడానికి శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగవేదికపై నుండి సోమవారం ఉదయం 9 గంటల 10 నిమిషాలకు పిఎస్ఎల్వి –సి58 రాకెట్ ద్వారా ఎక్స్ పో శాట్ అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. 480 కిలోల బరువు కలిగిన ఎక్స్ పో శాట్‌తో పాటు ఒక కిలో బరువు కలిగిన కేరళ యూనివర్సిటీ విద్యార్థులు తయారు చేసిన విఐవై అనే నానో ఉపగ్రహాన్ని కూడా ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు ఇస్రో సిద్ధం చేసింది. భూమికి 650 కిలోమీటర్ల ఎత్తులోని అంతరిక్షకక్షలో తిరిగే ఎక్స్ పో శాట్ ఐదేళ్ల పాటు పనిచేస్తుంది. ఇది ప్రధానంగా ఎక్స్ కిరణాలపై అధ్యయనం కోసం జరుపుతున్న ప్రయోగం ఇది. ఈప్రయోగం భవిష్యత్తు ప్రయోగాలకు కీలకంగా ఉపయోగపడుతుంది. టెలిస్కోప్ లాగా ఉపయోగపడే ఈ ఉపగ్రహం ఎన్నో అంతరిక్ష రహస్యాలను ఛేదించబోతుందని చెప్పాలి. ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించిన 25 గంటల కౌంట్ డౌన్ ఆదివారం ఉదయం 8.10గంటలకు ప్రారంభించారు. కొత్త సంవత్సరం ప్రారంభం మొదటి రోజున రాకెట్ ప్రయోగం జరపడం పట్ల అందరి దృష్టి ప్రయోగంపై పడింది.



ప్రయోగ వేదికపై సిద్ధంగా ఉన్న పిఎస్ఎల్వి - సి58 రాకెట్

ఆటపాటలతో అంగన్వాడీల నిరసన


తిరుపతిలో..


గూడూరులో..

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

అంగన్వాడీల సమ్మె ఆదివారం 20వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా మంత్రివర్గంలోని మంత్రుల ఫోటోలన్నీ అంగన్వాడీలు ధరించి వాళ్లే మంత్రులుగా భావించి మంత్రివర్గమంత్రి వర్గాన్ని ఒక టీంగా, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ మరో టీముగా ఆడుదాం మంత్రులతో కబడ్డీ అంటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం పూలతో గౌరమ్మను ఏర్పాటు చేసి గొబియాలు ఆడారు. సమ్మె శిబిరం వద్ద పాటలు పాడుతూ, డ్యాన్స్ చేస్తూ ఆలపించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ గత 20 రోజులుగా అంగన్వాడీలు పోరాటం చేస్తుంటే ముఖ్యమంత్రికి, మంత్రులకు చీమకుట్టినట్లు కూడా లేకపోవడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు ఎల్లమ్మ, సుజిత, రోజా, రాజేశ్వరి, అరున, గోమతి పాల్గొన్నారు.


నాయుడుపేటలో..

గూడూరు టౌన్: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె ఆదివారం 20 రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద పాటలు పాడుతూ, డాన్సులు చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు ఇంద్రావతి, కార్యదర్శి ప్రభావతి, సెక్టార్ లీడర్లు ముని కుమారి, మంగమ్మ, లక్ష్మీ, ప్రసన్న, భారతి, పెంచలమ్మ , రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సిఐటియు నాయకులు బివి.రమణయ్య, సురేష్, ఆడపాల ప్రసాద్, గుర్రం రమణయ్య, విఆర్ఏ సంఘం అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, బి.చంద్రయ్య పాల్గొన్నారు.



పిచ్చాటూరులో..

పిచ్చా టూరు: సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు ప్రాజెక్టు దగ్గర అంగన్వాడీల సమ్మె 20వ రోజుకు చేరుకున్నది. సిఐటియు నాయకులు ఎన్.నాగరాజు, రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆటపాటలతో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు తమకేమీ పండుగలు లేవంటూ సమ్మెను కొనసాగించారు. అంగన్వాడీలు శ్రీవాణి, గ్లోరీ ఆముద, దుర్గా ప్రమీల, భారతి పాల్గొన్నారు.

నాయుడుపేట: రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు తమ న్యాయమైన కోర్కెల కోసం చేస్తున్న నిరవధిక సమ్మె నేటికి 20రోజులకు చేరుకుంది. ఈ ప్రభుత్వం మూలంగా శిబిరంలో ఎన్ని ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కోవాలి అంటూ రోడ్డు పక్కన శిబిరంలో దుమ్ము దూళికి అక్కడే భోజనం చేస్తున్న అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఎన్.శ్యామలమ్మ, సిఐటియు నాయకులు శివకవి ముకుంద, పి.మునిరాజా, కళావతి, నాగమణి, మేరీ, ప్రమీల పాల్గొన్నారు.

రేణిగుంట: పట్టణంలోని పాత తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఐసిడిఎస్ అంగన్వాడీ ప్రాజెక్టులో అంగన్వాడీ సమస్యల పైన జరుగుతున్న సమ్మె 20 రోజులకు చేరుకొంది. అందులో భాగంగా ఆదివారం ఆటపాటలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి కృష్ణమూర్తి, అధ్యక్షులు ముని, నాయకులు ఓ. వెంకట రమణ, హరినాథ్, కెవిఎస్. సెల్వరాజ్, ఈశ్వరి, శివానందం, సత్యవతి, పారిశుధ్య కార్మికులు మునిలక్ష్మీ, అంగన్వాడీలు ధనమ్మ, భాగ్య, విజయ, ప్రభ, పెంచలమ్మ, లక్ష్మీ, గీత పాల్గొన్నారు.



రేణిగుంటలో..

గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలి

వీసీ ఆచార్య డి.భారతి

ప్రజాశక్తి - క్యాంపస్: విద్యార్థులు క్రీడాపోటీలలో గెలుపు ఓటములను క్రీడాస్ఫూర్తితో సమానంగా స్వీకరించాలని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.భారతి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో దక్షిణ రాష్ట్రాల విశ్వవిద్యాలయాల వాలీబాల్ మహిళల టోర్నమెంట్ డిసెంబర్ 27 నుంచి 31 వరకు ఘనంగా నిర్వహించారు. ఈ ముగింపు సమావేశానికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజనీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా మానసిక శారీరికగా అభివద్ధి చెంది సరైన నిర్ణయాలు తీసుకోవడంలో పరిపూర్ణత సాధించగలరన్నారు. వారు గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం చెన్నై, రెండవ బహుమతి మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం కోటయ్య, మూడవ బహుమతి జప్పిఐయారు యూనివర్సిటీ చెన్నై, నాలుగవ బహుమతి కాలికట్ కేరళ విశ్వవిద్యాలయం గెలుపొందారు. ఏఐయూ అబ్జర్వర్ కే. సెల్వకుమార్ ఇంత చక్కని టోర్నమెంట్ ఆర్గనైజ్ చేసినటువంటి యూనివర్సిటీకి అభినందనలు తెలిపారు. డీన్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొఫెసర్ అనురాధ, ఎఐయు అబ్జర్వర్ డాక్టర్ సెల్వ కుమార్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ జి.సారాసరోజినీ పాల్గొన్నారు.



పోటీలో గెలుపొందిన జట్టుకు బహుమతులు ప్రధానం చేస్తున్న వీసీ

అమ్మణ్ణిని దర్శించుకున్న కలెక్టర్


కలెక్టర్‌కు అమ్మవారి తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ ఈవో

ప్రజాశక్తి - సూళ్లూరుపేట: సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకొని పూజలు చేశారు. ముందుగా ఆలయం వద్ద కార్యనిర్వహణాధికారి వెంకట శ్రీనివాసులు రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ కుటుంబసభ్యులతో కలిసి అమ్మణ్ణిని దర్శించి పూజలు చేశారు. ఈవో శ్రీనివాసులు రెడ్డి చేతులు మీదుగా కలెక్టర్‌కు ఆలయ మర్యాదలు అందించి వేదపండితుల చేతఆశీర్వాదాలు అందజేశారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కె.సురేష్‌బాబు, ఓ.బాల సత్యనారాయణ, ఎం.పద్మజ, బి.సునీత, ఆర్డీవో చంద్రముని, ఎమ్మార్వో రవి కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భగత్ రవి

కమిటీ సభ్యులుగా అక్బర్, హరిత ఎన్నిక

ప్రజాశక్తి - క్యాంపస్: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర 24వ మహాసభలు కాకినాడలో 3 రోజుల పాటు 27, 28, 29 తేదీలలో జరిగాయి. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు కల్పించడం సంతోషం అని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ నాయకులు రవి, వినోద్, ప్రసాద్, హరిలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా భగత్ రవి, కమిటీ సభ్యులుగా అక్బర్, హరిత ఎన్నికతో జిల్లాలో ఎస్ఎఫ్ఐను ముందుకు తీసుకెలెందుకు, విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని తెలిపారు.

6వ రోజూ కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ఒంటికాలిపై, అర్థనగ్న ప్రదర్శనలతో నిరసనలు



వెంకటగిరిలో..

ప్రజాశక్తి- వెంకటగిరి: సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారం నాటికి ఆరవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పట్టణ పురవీధులలో మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి అర్ధనగ్న ప్రదర్శన బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్, రాజావీధి, ఎంపీడీవో ఆఫీస్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య, వెంకటగిరి పట్టణ మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు టి.సుబ్బయ్య, ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం పర్మినెంట్ చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, డైలీ వేజెస్ కార్మికులందరినీ ఆఫ్కాస్ లోకి ఎక్కించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల్ని పరిష్కారం చేసి వేతనాలు పెంచినప్పుడు సమ్మె విరమింప చేస్తామని లేదంటే సమ్మె రోజురోజుకీ ఉదతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు నాయకులు ఏ.మంజుల, సుభాషిని, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు గూడూరులో ఆదివారానికి నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శిబిరంలో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. మున్సిపల్ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.గోపినాథ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉండగా పోటీ కార్మికులను తీసుకొని వచ్చి చెత్త ఎత్తించడం మంచిపద్ధతి కాదని దీన్ని మానుకోవాలని అన్నారు. రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, అధ్యక్షులు బివి.రమణయ్య, శ్రామిక మహిళ సంఘం కార్యదర్శి ఎం.సంపూర్ణమ్మ, జిల్లా కమిటీ సభ్యులు పెంచల ప్రసాద్ (పిపి), మురళి, రాగయ్య, అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్, దారా కోటేశ్వరరావు, శీనయ్య, కొండయ్య, సుబ్బమ్మ, ప్రసాద్, పద్మమ్మ, పెంచలమ్మ, అరుణమ్మ పాల్గొన్నారు.

నాయుడుపేట: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆరవ రోజుకు చేరుకుంది. ఆదివారం కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుండి కార్మికులు ర్యాలీగా అంబేద్కర్ విగ్రహం వరకు వచ్చి పూలమాలవేసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు శ్యామలమ్మ, సిఐటియు నాయకులు మునిరాజా మాట్లాడుతూ కార్మికులు అడుగుతున్న న్యాయమైన కోర్కెలు పరిష్కారం చేయడంలో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వంటెద్దు పోకడలకు పోతుందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు మున్సిపల్ కార్మికులపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెడితే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల వెంకటేశ్వర్లు, శివకవి, ముకుందా, వెంకటరత్నం, ఎన్.మస్తానయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో..
గూడూరులో..

మంత్రికి ఎస్ఎస్ఏ ఉద్యోగుల వినతి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: గత 12 రోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆదివారం కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమగ్రశిక్ష అభయాన్ సంఘం గౌరవాధ్యక్షుడు గండికోట నాగవెంకటేష్, ప్రదీప్‌కుమార్, చరణ్, మునికష్ణ, శివ, గంగాధరం, నవీన్, రమణ, జ్యోతి, ఉషారాణి పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్, జిల్లా ఇంచార్జి మంత్రి కె.నారాయణ స్వామి, రాష్ట్ర విద్యుత్తు, అటవీ భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యాటక, యువజన క్రీడాశాఖ మంత్రి ఆర్‌కె.రోజా, చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డప్ప, మద్దిల గురుమూర్తి, జిల్లా పరిషత్ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి, ఎస్పి పరమేశ్వర్ రెడ్డి, జిల్లాకు చెందిన శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, జేసి శుభం బన్సల్, డిఆర్ఓ పెంచల కిషోర్ తదితరులు ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ 2024 నూతన ఆంగ్ల సంవత్సర సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. 2024లో ప్రతిఇంటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివద్ధి కాంతులు వెల్లి విరియాలని ఆకాంక్షించారు.

ఎంపిని కలసిన ఎస్వీయూ ఉపకులపతి

ప్రజాశక్తి- క్యాంపస్



తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎం.గురుమూర్తిని ఎస్వీయూ విసి ఆచార్య వి. శ్రీకాంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం ఢిల్లీ స్థాయిలో కావలసిన సహకారం అందిస్తానని, కేంద్ర నిధులు సేకరించే ప్రయత్నం చేస్తానని,సి యస్ ఆర్ (కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబులిటీ) నిధుల సమీకరణ కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఎస్వీయూ అభివృద్ధి కోసం సహకరిస్తున్న యంపికి విసి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం)

గ్రామీణ వ్యవసాయ పద్ధతులు, హార్టికల్చర్ నూతన కార్యక్రమాలను విద్యార్థుల అధ్యయనం కోసం ఎస్ఆర్ఎమ్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో చెంగల్పట్టు డీన్ డాక్టర్ శ్రేయస్ బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్, బీఎస్సీ ఆనర్స్ హార్టికల్చర్ విద్యార్థులతో కలిసి చెంగల్పట్టు జిల్లా వేదాంతంగల్ గ్రామంలో పర్యటించామని శ్రేయస్ తెలిపారు. ఈ అధ్యయన కార్యక్రమం 90రోజుల పాటు సాగుతుందని తెలిపారు. ఈ 60 రోజులు గ్రామంలో బస చేస్తూ రావే లక్ష్య సాధనకు విద్యార్థులు, రైతులు మధ్య పరస్పర ముఖాముఖి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈఅధ్యయన కార్యక్రమంలో సోఫియా, పసుపులేటి వసుంధర, కార్తీకనాథ్, హర్షిని, ఆర్.హరిణి, టి.అభినయ, దేవిఅదిరై విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ గ్రూపు ఫెసిలిటేటర్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ వెటర్నరీ సైన్స్ డాక్టర్ శ్రేయస్ వ్యవహరిస్తున్నారు.

ప్రతిభకు పదును పెడుదాం..

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

ఇంటర్వ్యూ


జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఎస్.సయ్యద్ సాహెబ్

ప్రజాశక్తి- తిరుపతి సిటి: ఈ పోటీ ప్రపంచంలో పిల్లలకు చదువులతో పాటు ఇతరాత్ర రంగాల్లో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి, వారికి ప్రతిభకు పదునుపెడుదామని తల్లిదండ్రులు, గురువులకు జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి ఎస్.సయ్యద్ సాహెబ్ తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల నిర్వహణలో ముఖ్యపాత్ర పోషిస్తున్న తనను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ తనకు మొదటి నుంచి క్రీడల పట్ల చాలా ఆసక్తి ఉందన్నారు. చిన్నప్పటి నుంచి తన ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు ఆ దిశగా తనను ప్రోత్సహించారని గుర్తు చేసుకున్నారు. క్రికెట్‌లో మంచి ప్రతిభ చూపానని, ఆల్ ఇండియా క్రికెట్ ఇంటర్ యూనివర్శిటీ లెవల్, సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో తాను ప్రాతినిధ్యం వహించానన్నారు. తనలోని ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం 1993లో క్రికెట్ కోచ్‌గా విధుల్లోకి తీసుకుందన్నారు. అప్పటి నుంచి 30 సంత్సరాలుగా వివిధ హోదాలో పని చేశానన్నారు. పదోన్నతిపై డిఎస్‌డివోగా చిత్తూరు, కాకినాడలో, కడపలోని వైఎస్ఆర్ స్పోర్ట్సు స్కూల్‌లో స్పెషల్ ఆఫీషర్‌గా విధులు నిర్వహించానని, ప్రస్తుతం తిరుపతి జిల్లా డిస్ట్రిక్ స్పోర్ట్స్ డెవెలప్‌మెంట్ ఆఫీసర్‌గా బాధ్యతులు నిర్వహిస్తున్నాని తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. విద్యార్థులను మానసికంగా, శారీరకంగా కూడా దృడంగా తయారు చేయడానికి క్రీడలు ఎంతో అవసరమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలను కేవలం పుస్తకాల పురుగులుగానే చేయడం సరైనది కాదన్నారు. ఎప్పడు ర్యాంకులు, మెడల్స్ మాత్రమే కాదని, సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు, సమస్యలను ఎదుర్కొనే పోరాట పటిమి, మానసిక ఉల్లాసం, శారీరక దృడత్వం, తదితర వాటిని కూడా పిల్లలకు తెలియజేయాలన్నారు. క్రీడలు అనేవి ప్రతి ఒక్కరిలో మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని, ఇబ్బందులు ఎదురైతే పరిస్కరించేందుకు ధైర్యాన్ని అందిస్తాయని, వారిలోని సృజనాత్మకతకు పదును పెడితే రాష్ట్ర, దేశ స్థాయిలోనే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చూపి ఉన్నత శిఖరాలకు ఎదుగవచ్చన్నారు. మధ్య తరగతి కుటుంబాల్లో పుట్టిన ఎంఎస్.ధోని, సచిన్ రమేష్ టెండుల్కర్, రవీంధ్ర జడేజా, కరణం మల్లేశ్వరి, పివి సింధు, సానియా మీర్జా, వంటి వారి తమ ప్రతిభ ఆదారంగా అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిని సాధించారని గుర్తు చేశారు. శరీరం ఆరోగ్యంగా ఉంటే ఆలోచనలు కూడా అంతేస్తాయిలో గొప్పగా ఉంటాయన్నారు. ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది టీవీలు, సెల్‌ఫోన్లకు అంకితమై మనుషుల మధ్య సంబంధాలు దూరమవుతున్నాయని అన్నారు. వాటిని ఈ క్రీడలతో అధిగమించవచ్చు అన్నారు. ఎవ్వరిలో ఏశక్తి దాగి ఉందో తెలీదని, పిల్లల ఆసక్తిని గమనించి తల్లిదండ్రులు వారి ఇష్టాలను గౌరవించి, ఆ దిశగా వారికి సరైన శిక్షణ ఇప్పిస్తే ఖచ్చితంగా ఆ రంగంలో వారు రాణించి, నిష్టాతులవుతారని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా జిల్లావ్యాప్తంగా క్రీకెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నీకాయిట్, యోగా, చెస్ తదితర అంశాలో లక్షా 70వేల మంది ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకున్నారు. అందులో స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటిగా వార్డు, గ్రామస్థాయిలో, రెండో దఫా మండల స్థాయిలో, మూడో ధఫా నియోజకవర్గ స్థాయిలో, నాలుగో దఫా జిల్లా స్థాయిలో వీటిలో విజేతులుగా నిలిచిన వారికి చివరికి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆయా స్థాయిని బట్టి ప్రోత్సహకర బహుమతులు కూడా అందిస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభకు పదునుపెట్టి, విజేతులుగా నిలివాలని పిలుపునిచ్చారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

- శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా..
- మీడియా సమావేశంలో బొజ్జల సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: నియోజకవర్గ ప్రజల ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శ్రీకాళహస్తిలో శాసనసభ్యులుగా ఒక్కసారి అవకాశం ఇస్తే తన తండ్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డిలా అభివృద్ధిని ఏమిటో చేసి చూపిస్తానని తెలిపారు. పారదర్శక పాలన అందించక పోయినా మళ్లీ తనకు ఓటు వేయవద్దని మనస్సాక్షిగా చెబుతున్నట్లు స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి ఓటుకు రూ.10వేలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇస్తే తీసుకొని ఓటు తనకు వేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 85శాతం పూర్తిగా నెరవేర్చలేదన్నారు. జగన్ పాలన పూర్తి అవినీతిమయం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

అయిపోయిందని ఆరోపించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసుదన్‌రెడ్డి భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, పేదల భూములను అక్రమంగా సొమ్ము చేసుకొనే విధానాలకు తెరలేపి దోచుకున్నట్లు విమర్శించారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని అన్ని విధాల ప్రజాధనాన్ని కాజేశారంటూ మండిపడ్డారు. సమావేశంలో టీడీపీ నేతలు గుమ్మడి పూడి దశరధాచారి, మిన్నల రవి, రాంబాబునాయుడు, అస్మత్, పోలూరు శ్రీనివాసులురెడ్డి, దారా పాండు, ఢిల్లీ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం : డీఎస్పీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: పేదవారికి స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సహాయాన్ని వారు సద్వినియోగం చేసుకొని వాళ్ళను గుర్తుంచుకోవాలని సమాజంలో ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలని గూడూరు డిఎస్సి సూర్యనారాయణ రెడ్డి వెల్లడించారు. పట్టణ సమీపంలోని చవటపాలెంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కేక్‌కట్ చేసి అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆంధ్ర మహిళా మండలి, ఇన్నర్ వీల్ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో సత్ప్రవర్తనతో ఉంటూ మంచి పేరు పొందాలని తెలిపారు. ఇటీవల కాలంలో ఎక్కువమంది మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారని సంఘవిద్రహశక్తులుగా మారుతున్నారని అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. క్లబ్ గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేటి


కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ

పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణ చూసుకోవాలని మంచి ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. చిన్నతనం నుండి జంక్ ఫుడ్‌లు తినే చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలతో ఎక్కువ మంది హాస్పిటల్‌కి వస్తున్నారని తల్లిదండ్రులు మంచి ఆహారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విష్ణువందన, స్నేహలతరెడ్డి, శశిరేఖ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంతం 'ఆప్'తోనే సాధ్యం

- రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచలపతి పిలుపు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అవినీతిరహిత పాలన ఆమ్ ఆద్మీ పార్టీతో మాత్రమే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచలపతి పేర్కొన్నారు. పార్టీ చేపట్టిన సామాన్యుడి శంఖారావం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం 4వరోజు బిఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లోని వివిద గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సామాన్యులను శక్తివంతులుగా చేయాలన్నదే తమ పార్టీ లక్ష్యం అన్నారు. డబ్బుతో ఓట్లు కొనడం తమ విధానం కాదని, ప్రజాసేవకు పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలు ఎదుర్కునే ప్రతి సమస్యను పరిష్కరించగలమన్నారు. మండల పార్టీ కన్వీనర్‌గా బాలరాజును నియమించారు. కార్యక్రమంలో పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ కోఆర్డినేటర్ నీరుగట్టు నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి



గ్రామాల్లో పర్యటిస్తున్న ఆప్ పార్టీ నాయకులు

బొప్పన శ్రీనివాస్, జిల్లా కోశాధికారి డాక్టర్ డి.వెంకటేష్, సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మొరుంపల్లి నందిని, వరదయ్యపాలెం మండల కన్వీనర్ సందింటి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్‌కు సాత్వికాహారం పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: నూతన్య సంవత్సరం పురస్కరించుకొని వాకర్స్‌కు వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాత్వికాహారాన్ని పంపిణీ చేశారు. తిరుపతి కరకంబాడి రోడ్డులోని వినాయకసాగర్ వద్ద యోగామాస్టర్ వెంకటేశ్వర్లు, వారి బృందంతో కలిసి 500మందికి ఈ సాత్వికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 2023 ఏడాధిలో చేసిన తప్పొప్పులను క్షమించమని ఆ కలియుగదైవంను వేడుకొని నూతన సంవత్సరానికి గుండె పదిలంగా ఉండేందుకు దోహదపడే సాత్వికాహారంతో ఆహ్వానం పలుకుతున్న యోగ బృందానికి వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజులలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మరింతగా సేవా కార్యక్రమాలు చేసి అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని కార్యవర్గానికి సూచించారు. అసోసియేషన్ అధ్యక్షులు దశరథ రెడ్డి


సాత్వికాహారం పంపిణీ చేస్తున్న కృష్ణప్రసాద్

యోగమాస్టర్‌కు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాలాజీ నాయుడు, పిఆర్‌ఓ కృష్ణంరాజు, నరసింహయ్య, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ అవసరం'

ప్రజాశక్తి-క్యాంపస్: విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం రిమ్స్ కళాశాలలో ఎంసీఏ, ఎంబీఏ, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, కెరీర్ గైడెన్స్‌పై ఏడు రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేకమైన నిష్ణాతులైన అధ్యాపకులు చేత శిక్షణ కార్యక్రమాలను ప్రతి సంవత్సరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. చివరి సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్వేర్ ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలలో అన్ని రకాల నైపుణ్యాలపై శిక్షణ అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోర్సు చివరి సంవత్సరం విద్యార్థులకు మార్చి నెలలో కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌం డేషన్ ఏపీ మేనేజర్ మోహన్, చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, ట్రైనింగ్ ఆఫీసర్లు గురుసాయి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సదస్సులో కళాశాల చైర్మన్ కొండారెడ్డి, డైరెక్టర్లు ఆనందరెడ్డి, విజయరెడ్డి, విభాగాధిపతులు నిరంజన్‌రెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశంలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని ఎస్ఆర్ఎస్ జడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాలలో 1976-1978 సం" పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదివినటువంటి పూర్వ విద్యార్థులందరూ ఒకే వేదికపై అదే కళాశాలలో ఆదివారం హాజరయ్యారు. ఆనాటి జ్ఞాపకాలు అరేయ్ ఒరేయ్, మావ బావ నాటి పిలుపులు, ఆప్యాయతల స్థానాల్లో సార్, గారు, మర్యాదల మార్పులు, అందరూ కలిసి వేదికపై వారి గురువులకు, ఉన్నత స్థానాలు అధిరోహించిన వారికి సన్మానాలు, పులమాలలతో మర్యాదలు చేశారు. పలకరింపులు, షేక్ హ్యాండ్‌లు, కౌగిలింతలు పరామర్శలు, కాలగర్భంలో జారిపోయి కరిగిపోయిన కొందరు నేస్తాల కన్నీటి జ్ఞాపకాలు, తెలియకుండానే కరిగిపోయిన కాలం, అందరి ఆత్మీయ పలకరింపుతో ఆత్మీయ సమ్మేళనం ముగిసింది.

ప్రజలందరికీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే ఆదిమూలం


ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి-నారాయణవనం: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలి.. ఇంటింటా సంక్షేమ చేకూరి సుఖ: సంతోషాలతో జీవిం చాలి.. అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేడు అమృత్ భారత్ రైలు రాక

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు స్టేషన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు కోరారు. ఆయన ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోమవారం మధ్యాహ్నం 12గంటల 30నిమి షాలకు అమృత్ రైలు రానున్నట్లు వివరించారు. ఈ రైలు మాల్టా నుంచి బెంగళూరుకు మధ్య రాకపోకలు సాగిస్తుం దన్నారు. సోమవారం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు. సమావేశంలో కుమార్‌ప్రసాద్, శ్యామ్‌యాదవ్, జి.ఆర్.పి.ఎస్.ఐ కేకే నాయుడు, ఆర్‌పిఎఫ్ ఎస్‌ఐ లీలాకృష్ణ పాల్గొన్నారు.

చెత్తకుండీ.. నిర్వహణ ఏదండీ.!

- వార్డులో పారిశుద్ధ్య లోపం.. అది పాలకుల జాప్యం
- దోమలు ప్రబలి, దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న పట్టన వాసులు
- అధికారులు పట్టించుకోలేదని గగ్గోలు


నిర్వహణ లేక రోడ్డుపై నిండిన చెత్త

పేరుకేమో పురపాలక పరిధి.. అక్కడంతా నిర్వహణ వెలతి.. అడుగడునా అపరిశుభ్రం.. ఊరంతా చెత్త.. వీధుల్లో నిండిన మురుగు.. ఇదీ పుత్తూరు పురపాలక పరిస్థితి. పారిశుద్ధ్యం లోపించి, మురుగు పారక ఇబ్బందులు పడుతుంటే పాలకులు పట్టించుకోక, అధికారులు వినిపించుకోక పేరు గొప్ప ఊరు దిబ్బ చందంగా తయారైదంటూ పుత్తూరు పట్టనవాసులు గగ్గోలు పెడుతున్నారు.

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టనంలోని పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డులో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయింది. పది రోజులు కావస్తున్న చెత్త సేకరణ చేయలేదంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెట్టారని, ఎక్కడికక్కడ చెత్తాచెదారం నిండిపోయి వీదులంతా అపరిశుభ్రంగా ఉందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో మురుగుపాలక పేరుకుపోయి ఉండడంతో దోమలు ప్రబలుతున్నాయని, తద్వారా విషజ్వరాలు వస్తున్నట్లు వార్డు ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెనువెంటనే చర్యలు చేపట్టి పారిశుద్ధ్యం మెరుగుపరచాలని కోరుతున్నారు. దోమల మందు స్ప్రే చేయించడానికి అధికారులు చొరవ తీసుకోవాలని వేడుకుంటున్నారు. అలా కాని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.


పేరుకుపోయిన డ్రైనేజీ

యోధుల ఆశయబాటలో ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-క్యాంపస్: స్వాతంత్ర యోధులు కలలుకన్న స్వరాజ్యం, సోషలిజం బాటలో ఎస్ఎఫ్ఐ నడుస్తూ అందరికీ విద్యా, ఉపాధి, సమాన అవకాశాలు కోసం ప్రయాణిస్తూ 54వ సంవత్సరములోకి ఎస్ఎఫ్ఐ నడుస్తుంది అని తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి భగత్ రవి అన్నారు. ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎస్వి యూనివర్సిటీలో ప్రకాశం భవన్ ముందు ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆవిష్కరణ చేశారు. ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాను కాపాడుకునేందుకు దేశం అంతటా అలుపెరుగని పోరాటం చేస్తున్న సంఘామ్ ఎస్ఎఫ్ఐ అని అన్నారు. దేశంలో, రాష్టంలో భారత రాజ్యాంగం పరిరక్షణకై, అందరికీ విద్యా కోసం పోరాడుతూ ప్రతిష్టత్మక విశ్వవిద్యాలయాలలో ఎస్ఎఫ్ఐ గెలుస్తు పతాకం ఎగురుతుందని ఎయిడెడ్ విద్యా సంస్థల కొనసాగాలని రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోరాడింది ఎస్ఎఫ్ఐ అని అన్నారు. విద్యార్థుల హక్కులు కోసం, సమస్యలుపై మరింత పోరాటాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. అదే విదంగా ఎస్వి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ జిల్లా నాయకులు పవన్ ఆవిష్కరణ చేశారు. స్వాతంత్ర్యం, ప్రజా స్వామ్యం, సోషలిజం కోసం ఎస్ఎఫ్ఐ అధ్యయనం, పోరాటం నినాదాలతో విద్యా, వైద్యం, ఉపాధి కోసం పోరాడుతుందని వారు అన్నారు. కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ ఎస్వీయూ అధ్యక్షులు నరేంద్ర, వినోద్, నాయకులు వీరేష్, శివ అబ్బాస్, కిరణ్, సిటీ నాయకులు పురుషోతం, సతీష్, ప్రశాంత్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మళ్లీ జగనన్న ప్రభుత్వమే.. : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎన్ని పార్టీలు ఏకమైనా, ఎన్ని కుతంత్రాలు పన్నినా రాష్ట్రంలో అధికారం చేపట్టబోయేది మళ్లీ జగనన్న ప్రభుత్వమేనని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆదివారం పట్టణంలోని 23వ వార్డులో పర్యటించారు. అక్కడి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. ముఖ్యంగా తంజావూరు కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తదనంతరం ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రతి ఇంటికి జగన్ ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మళ్లీ జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యేతో పాటు తిరుపతి ఎంపీ గురుమూర్తి, వార్డు ఇన్చార్జి ఎమ్మార్ మురళీ, సురేష్, మీర్జా, నందా, జయ, శివకుమార్, షబ్బీర్, ఇదియతుల్ల తదితరులు పాల్గొన్నారు.


గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ

జగనన్నను మార్చేద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్రంలో నియంత పాలన సాగిస్తున్న సీఎం జగనన్నను మార్చేద్దావని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలోని 22వ వార్డులో 'బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ నగర్, రిజర్వాయర్ రోడ్డు, కొండమిట్ట తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మిని మ్యానిఫెస్టోని వివరించారు. ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలపై హింసకు పాల్పడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, డాక్టర్ ఉమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాళహస్తిలో ఇంటింటి కార్యక్రమంలో టీడీపీ నాయకులు

పుత్తూరుటౌన్: భావితరాలకు భవిష్యత్తు కోసం చంద్రబాబు కృషి చేస్తారని రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్ పేర్కొన్నారు. ఆదివారం గేట్ పుత్తూరులోని ఇంటింటికీ వెళ్లి టీడీపీని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు గంజి మాధవయ్య, గాలి జీవరత్నం నాయుడు, ధనపాల్, సుజాత, యుగంధర్, గోపిఆచారి, అనుంబు అలగన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

- విజేతగా ఎస్.కె.ఆర్ రన్నర్‌గా వైష్ణవి కాలేజ్

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఎస్.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని అంతర కలశాలల క్రికెట్ పోటీలు ముగిశాయి. మొదటగా బ్యాటింగ్ చేపట్టిన వైష్ణవి డిగ్రీ కాలేజ్ 96 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేపట్టినా ఎస్.కె.అర్ కళాశాల జట్టు లక్ష్యాన్ని ఛేదించి విజేతగా నిలిచింది.. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లడుతూ ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో మెలగలన్నారు. అనంతరం విజేతలను అభినందించారు. ట్రోఫీని అందచేశారు. కార్యక్రమంలో నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు ట్రోపి అందిస్తున్న వైస్ ప్రిన్సిపల్

పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా రమణ

ప్రజాశక్తి -పుంగనూరు: పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పుంగనూరుకు చెందిన జీవీ రమణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. విజయవాడలో జరిగిన పిఆర్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మూడవసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జివిరమణ ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ సంఘ జనరల్ సెక్రెటరీ గిరి ప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ మూడవసారి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నుకోవడంతో తనకెంతో బాధ్యత పెరిగిందని శక్తి వంచన లేకుండా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఐ ఆర్ , ప్రతినెల మొదటి తేదీన జీతం, పిఎఫ్, ఏపీ జిఎల్ఐ సి బకాయిలు, డి ఏ త్వరితగతిన మంజూరు అయ్యేటట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎప్పటికీ రుణపడి ఉంటానని, అహర్నిశలు సేవలు చేయడానికి ముందు ఉంటానని తెలిపారు.

మాజీ సర్పంచులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: కుప్పంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో వైసీపీకి చెందిన మాజీ సర్పం చులు పుష్పరాజ్, దేవరాజులురెడ్డి రెండు రోజుల క్రితం టిడిపిలో చేరిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మండలంలోని నెల్లెపల్లిలో ఆదివారం మాజీ సర్పంచులు పుష్పరాజ్ , దేవ రాజులురెడ్డి, నెల్లేపల్లి మాజీ ఎంపిటిసి సుబ్రమణ్యంను పార్లమెంట్ టిడిపి, టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్ నాయుడు గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టిడిపి ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవసుందరం, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జ్యోతిరెడ్డి, జ్యోతి శ్వరన్ పలువురు టిడిపి నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఓల్డ్ ఏజ్ హోమ్‌ను తనిఖీ చేసిన జెడ్పీ సీఈవో

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: స్థానిక తపో వనం లోని 'ఓల్డ్ ఏజ్ హోంను, వికాస్ విహార్ స్కూల్ (రాస్)ను జడ్పి సిఇవో ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓల్డ్ ఏజ్ హోమ్‌లోని వృద్ధులకు కనీస వసతులను పరిశీలించి, ఓల్డ్ ఏజ్ హోమ్‌లో సౌకర్యాలు సక్రమంగా ఉన్నాయా? లేవా? పరిశీలించి, వృద్ధులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం వికాస్ విహార్ స్కూలులో విద్యార్థుల హాజరు పట్టికను, బోధనా తరగతులను, హాస్టల్‌ను, స్టోర్ రూమును, వంట గదిని, కనీస వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి 'బోధన ఎలా వుంది? మీరు ఏమి నేర్చుకున్నారు?' అని ప్రశ్నించి, విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు.

జగన్ అభిమాని పాదయాత్ర

ప్రజాశక్తి -సదుం : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతో ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర నిర్వహి స్తున్నట్లు మాజీ ఎస్‌సి కమిషన్ సభ్యుడు కట్టిపోగు బసవరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సదుంలో ఎంపిపి ఎల్లప్ప ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వై నాట్ 175 అన్నట్లు రాబోయే 2024 సాధారణ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు న్యాయం చేశారన్నారు. రాబోయే ఎన్నికలలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పుంగనూరు, తంబళ్లపల్లి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సింగిల్ విండో వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి రమేష్ రెడ్డి, గొంగి వారి పల్లి సర్పంచ్ నారాయణరెడ్డి, దళిత నాయకులు వెంకటస్వామి మల్లేపల్లి శ్రీనివాసులు, రామచంద్రయ్య, శ్రీరాములు, చంద్ర వెంకటస్వామి నాగరాజ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పాదచారుడిని ఢీకొన్న కారు

ప్రజాశక్తి-తడ: రహదారిపై వెలుతున్న పాదచారుడిని కారు ఢీకొన్న సంఘటన ఆదివారం మండలంలోని గ్రద్దగుంట వద్ద చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు.. గ్రద్దగుంట గ్రామానికి చెందిన నవీన్(20) తన స్నేహితులు గ్రామ సమీపంలో క్రికెట్ ఆడుతుండగా రహదారిగుండా అక్కడి నడిచి వెళుతున్నాడు. ఆ సమయంలో నెల్లూరు నుంచి చెన్నైకు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో నవీన్ తీవ్రగాయాలపాలై రహదారి పక్కన పడ్డాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని 108లో సూళూరుపేట ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడ్డ యువకుడు నవీన్

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- ఇద్దరి మృతి

ప్రజాశక్తి-కేవిబిపురం: కారు అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లిన సంఘటనలో ఇద్దరు మృతి చెందిన ఉదంతం ఆదివారం మండలంలోని మిద్ది కండ్రిగ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చెన్నై పట్టాభిరామి నుంచి ఐదుగురు స్నేహితులు ఆరే కోనై వాటర్ ఫాల్స్‌కు వెళ్లి తిరుగు ప్రయాణంలో మిద్ది కండ్రిగ సమీప చెరువు వద్ద కారు అదుపు తప్పింది. దీంతో కారు చెరువులోకి దూసుకెళ్లి మునిగిపోయింది. గుర్తించిన స్థానికులు, సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారును వెళికి తీశారు. ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడగా ఇద్దరు మృతి చెందారు. మృతి చెందిన వారిలో స్టీఫెన్‌రాజ్(30), ప్రభాకర్(31)లు ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తికి తరలించారు. ఎస్ఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కారును వెళికి తీసుకున్న దృశ్యం



మృతి చెందిన స్టీఫెన్‌రాజ్, ప్రభాకర్